ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

20-02-2026

మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 53 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD | శుక్రవారం | WWW.EPAPER.MAHAADAILY.COM

తెలంగాణలో మహిళలకు రూ.2,500

బడ్జెట్ లో కొత్త పథకాలకు నిధులు

ఈనెల 26 నుండి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, మహా: రేవంత్ రెడ్డి సర్కార్ మరో ఎన్నికల హామీ అమలు దిశగా కసరత్తు మొదలుపెట్టింది. మహిళల కోసం ఇప్పటికే అమలుచేస్తున్న పథకాలు సూపర్ హిట్ కాగా, ఇపుడు మహిళలకు రూ 2, 500 పథకంపై ప్రకటనకు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 28న అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బడ్జెట్ లో ప్రకటన దిశగా చర్చలు సాగుతున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. 28న 202627 వార్షిక బడ్జెట్ ను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనుంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఈసారి సభను 10 నుంచి 15 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మిగతా 2లో

టాప్ న్యూస్

మంత్రి సీతక్కపై రాహుల్ ప్రశంసలు

- సమ్మక్కసారలమ్మ వీరగాథ తెలుసుకున్న రాహుల్
- వచ్చే జాతరకు కచ్చితంగా వస్తామన్న ఖర్గే, రాహుల్



02

జాతిపిత అనిచెప్పుకోవడానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర వ్యాఖ్యలు

02

హైదరాబాద్ నుంచి పాకిస్తాన్‌కు ఫోన్

- చంచల్ గూడ జైలు నుండే భారీ కుట్రకు ప్లాన్
- ఉగ్రసంస్థ వ్యూహం పసిగట్టిన నిఘాటీమ్

02

బెంగళూరులో ఓపెన్ఏఐ

కొత్త ఆఫీస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటన

మహా: అంతర్జాతీయ ఏఐ కంపెనీలు భారత్ బాట పడుతున్నాయి. ఈ వారం ప్రారంభంలో ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ బెంగళూరులో తన మొట్టమొదటి ఆఫీసును ప్రారంభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంథ్రోపిక్ బాటలోనే మరో దిగ్గజ ఏఐ కంపెనీ ఓపెన్ఏఐ సైతం భారత్‌లో తన విస్తరణను వేగవంతం చేయాలని భావిస్తోంది. దీనికోసం బెంగళూరు తన కొత్త కార్యాలయాన్ని ప్రారంభిస్తామని ప్రకటించింది.

మిగతా 2లో

ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత

- అమెరికా చరిత్రలో అత్యంత చెత్త అధ్యక్షుడంటున్న అమెరికన్లు
- తాజా సర్వే వెల్లడి
- ఏడాది తిరిగేసరికే ప్రజాదరణ ఢమాల్

మహా: అమెరికా 48వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే ఆయన రేటింగ్ అత్యంత దారుణంగా పడిపోయింది. తాజాగా యాహూ/యుగోవ్ నిర్వహించిన సర్వేలో 40 శాతం మంది అమెరికన్లు ట్రంప్‌ను 'అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు' గా పేర్కొన్నారు. గతంలో అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన ఎవరికీ ఈ స్థాయిలో వ్యతిరేకత ఎదురుకాలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం 12 శాతం మంది మాత్రమే ట్రంప్‌ను 'అద్భుతమైన అధ్యక్షుడు' గా భావిస్తుండగా.. 53% మంది ఆయనను 'విఫల అధ్యక్షుడు' గా ముద్ర వేశారు.

మిగతా 2లో

సిద్దిపేట నుండే కవిత సింహగర్జన

తండ్రి కేసీఆర్ స్ఫూర్తితో పొలిటికల్ కెరీర్ పక్కా ప్లాన్

హరీష్ పై పోటీకి రెడీ.. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణలో ఉండవంటున్న కవిత

మేలో కొత్తపార్టీ.. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం మేమే.. రాజకీయ అడుగులపై కవిత క్లారిటీ

(హైదరాబాద్ - మహా)

తెలంగాణ జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత సిద్దిపేట నుండే సింహగర్జనకు రెడీ అవుతున్నారు. కొడితే కుంభస్థలాన్నే కొడుతానంటున్నారు. తన తండ్రి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సిద్దిపేట నుండే బరిలో నిలిచే రాజకీయ వారసురాలిగా చరిత్ర సృష్టించాలని, తెలంగాణ తొలి మహిళా సీఎం కావాలని కవిత వ్యూహరచన చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటనే తన మొదటి ఛాయిస్ అని కవిత స్పష్టం చేశారు. కవిత సిద్దిపేట ప్రాంతంలో భారీగా పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలసేకరణ కూడా చేసినట్లు తెలిసింది. సిద్దిపేట క్షేత్రంలో బలంగానే ఢీకొట్టాలని కవిత రంగంలోకి దిగుతున్నట్లు స్పష్టమవుతోంది. సిద్దిపేటలో రాజకీయాలు ప్రారంభించే కేసీఆర్ సక్సెస్ కాగా, ఇపుడు కవిత తన తండ్రి చూపిన బాటలోనే జన్మభూమి నుండి రాజకీయ కార్యాచరణకు సిద్ధమైంది. ఇటీవల మునిసిపల్ ఎన్నికల్లో దాదాపు 40 స్థానాల్లో జాగృతి బలపరిచిన మద్దతుదారులు కౌన్సిలర్లుగా గెలవగా, ఒక మునిసిపల్ ఛైర్ పర్సన్ పదవిని కూడా కైవసం చేసుకుంది. త్వరలో జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు కూడా బలం ఉన్న చోట పోటీచేయాలనుకుంటోంది. పార్టీ పెట్టిన తర్వాత ప్రతి ఎన్నికలోనూ పూర్తిస్థాయిలో దుమ్మురేపాలనుకుంటోంది.

మే మొదటివారంలో పార్టీ

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఖరారైంది. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. పార్టీ పేరులో తప్పకుండా తెలంగాణ ఉంటుందని చెప్పారు. గురువారం విలేకరులతో నిర్వహించిన చిట్ చాట్ లో ఆమె మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని కవిత అన్నారు. సిద్దిపేట, బోధన్ రెండింట్లో ఒకచోట పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. మొదటి చాయిస్‌గా సిద్దిపేట, రెండో చాయిస్ బోధన్ ఉంటుందన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఖతం

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉండవని, పార్టీ పెట్టిన తర్వాత తెలంగాణలో తామే ప్రధాన ప్రతిపక్షం అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2లో

తెలంగాణ నేతలపై కాంగ్రెస్ హైకమాండ్ హ్యాపీ

టీం తెలంగాణపై రాహుల్ , ఖర్గే ప్రశంసలు

పార్టీని బలోపేతం చేయాలని రాహుల్ దిశానిర్దేశం

గ్రేటర్ ముందా ? పరిషత్ ముందా? చర్చ

ఢిల్లీ, మహా : కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును అడిగి ఏఐసీసీ నేతలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. వరి ధాన్యం సాగు, కొనుగోలుకు సంబంధించిన విషయాలపై రాహుల్, ఖర్గే ప్రత్యేకంగా ఆరా తీశారు. తెలంగాణలో ఆయిల్ ఫాం పంటను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంప్రమైజ్ కావొద్దని ఏఐసీసీ నేతలు సూచించారు. పార్టీని బలోపేతం చేయాలని రాహుల్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చాలా బాగున్నాయని ఏఐసీసీ నేతలు ప్రశంసించారు. గ్రేటర్ ఎన్నికలు ముందు జరపాలా..? లేదా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముందు జరపాలా? అనే అంశం క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి నేతలు వచ్చారు. శాఖల వారీగా మంత్రుల నిర్ణయాలని రాహుల్ అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది కాబట్టి గెలవొచ్చని, కానీ లోకల్ బాడీ ఎన్నికల్లో గెలవాలంటే క్షేత్రస్థాయిలో బలంగా ఉండాలని ఖర్గే మార్గనిర్దేశం చేశారు. నేతలు సమష్టిగా పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని మంత్రులంతా నిరూపించారని రాహుల్‌గాంధీ కితాబిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా టీమ్ తెలంగాణపై, తెలంగాణ పనితీరు ఫలితాలపై రాహుల్ సంతోషం వ్యక్తం చేశారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2047 విజన్ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

తెలంగాణ నేతల భేటీపై ఖర్గే ట్వీట్

2లో

విజయారెడ్డి ఆత్మహత్య కేసు కొలిక్కి

చనిపోవడానికి అసలు కారణం ఇదే.. రెండు నెలలుగా మానసిక ఒత్తిడి

హైదరాబాద్ సిటీ, మహా : దాదాపు 20 రోజుల క్రితం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐటీ ఉద్యోగి విజయ రెడ్డి ఆత్మహత్య కేసు కొలిక్కి వచ్చింది. ఆమె మృతిపై ఎలాంటి అనుమానాల్లేవని కుటుంబీకులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. విజయ రెడ్డి రెండు నెలలుగా మానసిక ఒత్తిడికి గురైనట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. గత నెల 31న అర్ధరాత్రి దాటిన తర్వాత చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై ఐటీ ఉద్యోగి విజయరెడ్డి, కుమార్తె చేతన రెడ్డి, కుమారుడు విశాల్‌రెడ్డిలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే.

నోట్‌లో చేతిరాత ఆమెదే

ఈ అనుమానాస్పద కేసును సికింద్రాబాద్ జీఆర్పీ బృందాలు పలు కోణాల్లో వేగవంతంగా దర్యాప్తు చేపట్టాయి. ఉప్పల్ నుంచి పటాన్‌చెరు వరకు విజయారెడ్డి ప్రయాణించిన మార్గాల్లోని సీసీ టీవీ కెమెరాల ద్వారా పోలీసులు రికార్డైన ఫుటేజీని విశ్లేషించారు. ఆమె వద్ద లభ్యమైన సూసైడ్‌నోట్‌ను పరిశీలించి, చేతిరాత

మిగతా 2లో

ఈనెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు

రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్లు

హైదరాబాద్, మహా: తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 25న ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. తొలిసారిగా విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఇంటర్మీడియట్ బోర్డు హాల్ టికెట్లు పంపింది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ నుంచి వీటిని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి కూడా హాల్ టికెట్లు తీసుకునే అవకాశం కల్పించారు. 9.9 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 25న ఫస్ట్ ఇయర్, 26వ తేదీన సెకండియర్ పరీక్షలు మొదలు కానున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల కాలపట్టికను ఇంటర్ బోర్డు గతంలో విడుదల చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు.

హెరిటేజ్.. నాణ్యతలో రాజీ పడబోం

నారా భువనేశ్వరి

హైదరాబాద్, మహా: 33 ఏళ్లుగా ప్రతి ఇంటికీ తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందిస్తూ, ప్రతి పాడి రైతుకూ సాధికారత కల్పించడమే హెరిటేజ్ లక్ష్యమని హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

మిగతా 2లో

హార్ముజ్‌తో ఇచ్చిపడేస్తున్న ఇరాన్

వివరాలు 4లో